# కథ

**-వాణిశ్రీ**

# జీన్స్ వస్తే...?

**అరుణ్‌కి అనుపమ నచ్చింది. ఫోటోలోనే ఇంత అందంగా ఉంది. ఇక మనిషిని చూస్తే ఇంకెంత బ్యూటిఫుల్‌గా ఉంటుందో? అనుకున్నాడు. ఆ రాత్రి అతని కలలో అనుపమతో పెళ్లయినట్లు, సరసాలాడినట్లు, హనీమూన్ వెళ్లినట్లు రకరకాల దృశ్యాలు మధురమైన అనుభూతుల్ని కలుగజేసింది. తను హేండ్‌సమ్‌గా ఉంటాననీ, తనను చూసిన అమ్మాయి మదిలో కలవరింతలు, హృదయంలో పులకింతలు మొదలవుతాయనీ గట్టి నమ్మకం. హైదరాబాద్‌లో ఉద్యోగం, ఆస్తిపాస్తులకు కొదవ లేదు. కట్నకానుకల గొడవలకు పోకుండా అందమైన అమ్మాయిని పెళ్లిచేసుకోవాలనేది అతని గాఢమైన కోరిక.**

పెళ్లిచూపులకు అనుపమ ఇంటికి బయల్దేరారు అరుణ్ తల్లిదండ్రులు, అతని అక్క, బావ.

కారు దిగగానే అనుపమ తండ్రి సాంబశివరావు వచ్చి ఆహ్వానించాడు. పెళ్లిచూపుల తతంగం మొదలైంది. అరుణ్ అనుకున్నట్లే అనుపమ ఫోటోలో కంటే అందంగా కనిపించింది. అనుపమ అన్న సుధీర్, బెంగుళూరు నుంచి ప్రత్యేకంగా వచ్చాడు చెల్లెలి పెళ్లిచూపుల కోసం. సంబంధం కుదిరితే ముహూర్తాలు పెట్టుకోవడం, ఆ ఏర్పాట్లలో తండ్రికి సాయపడాలని వచ్చాడు.

''అమ్మాయితో ఏదైనా మాట్లాడాలనుకుంటే మాట్లాడు బాబూ!'' అన్నాడు అనుపమ తండ్రి సాంబశివరావు.

''అవసరం లేదండీ'' అన్నాడు అరుణ్ నవ్వుతూ.

అరుణ్ తల్లి ఏవేవో రొటీన్ ప్రశ్నలు వేసింది. పెళ్లిచూపుల తతంగం ముగిసింది.

''ఏం చెప్పమంటావురా?'' అడిగాడు అరుణ్ తండ్రి.

''ఇంటికెళ్లి కబురు చేస్తామని చెప్పు డాడీ'' అన్నాడు అరుణ్.

కట్నకానుకల విషయంలో పట్టుదల చూపవద్దనీ, అమ్మాయి అందంగా చదువుకున్నదైతే చాలనీ చెప్తూ వచ్చిన కొడుకు తన నిర్ణయం ఎందుకు వాయిదా వేశాడో అరుణ్ తండ్రికి అర్థం కాలేదు. అమ్మాయికి ఏ విధంగా చూసినా వంక పెట్టేపని లేదు. అందరికీ నచ్చింది. తాము వద్దన్నా తను కూతురికి ఇవ్వదల్చుకుంది ఇస్తాడు పిల్ల తండ్రి. ఇంకేంటి? కొడుకు అంతరంగం అర్థం కాలేదు. 'సరే' వాడే చెప్తాడని ఊరుకున్నాడు.

''ఏంటోయ్ బెట్టుచేస్తున్నావ్? ఇంటికెళ్లి చెప్తానన్నావట. ఏంటి సంగతి?'' నవ్వుతూ అడిగాడు శ్రీరామ్ బావమరిదిని.

''వాళ్లని ఆ మాత్రం సస్పెన్స్‌లో ఉంచాల్లెండి. మీరు మాత్రం పది రోజులు ఊరించి కదూ పిల్ల నచ్చిందని చెప్పింది'' అన్నది అరుణ్ అక్క రుక్మిణి.

''డాడీ! నాకు ఈ సంబంధం ఇష్టం లేదు'' సీరియస్‌గా అన్నాడు అరుణ్.

అంతా నోళ్లు వెళ్లబెట్టారు. వీడికేం పోయే కాలం అన్నట్లు చూశారు.

''అదేంట్రా! పిల్ల చక్కగా కుందనపు బొమ్మలా ఉంటేనూ! పైగా దబ్బపండు రంగూ, లక్ష్మీకళ ఉట్టిపడుతోంది. నీకేం వంక దొరికిందీ?'' అన్నది తల్లి నిర్మలమ్మ.

''పిల్ల అందంగా ఉంటే చాలన్నావుగదరా? మళ్లీ ఏంటి?'' అసహనంగా అన్నాడు తండ్రి గంగాధరం.

''అనుపమ బాగానే ఉంది డాడీ!'' అన్నాడు అరుణ్.

''మరేంటి?''

''అనుపమ అన్న సుధీర్ బాగా లేడు డాడీ. నల్లగా, తారుడబ్బా లాంటి మొఖం వాడూను. వాళ్ల నాన్న గూడా అంతే, నల్ల చింతపండు రంగు, వాళ్లిద్దరూ నాకు నచ్చలేదు డాడీ'' అసలు విషయం చెప్పాడు అరుణ్.

''పిల్ల అన్న, నాన్న ఎట్లా ఉంటే నీకేంట్రా? నువ్వు కాపురం చేసేది ఆ పిల్లతోనా? లేక ఆమె అన్న, నాన్నతోనా?'' కోపంగా అన్నాడు గంగాధరం.

''ఛీ..ఛీ... అది కాదు డాడీ. రేపు పిల్లలకు మేనమామ పోలికలు వస్తే ఎట్లా? జీన్స్ వల్ల మేనమామ, తాతల పోలికలు వస్తాయని నా ఫ్రెండ్ డాక్టర్ శంతన్ చెప్పాడు డాడీ. కొంపదీసి నాకొక ఆడపిల్ల పుడితే, దానికి మేనమామ పోలికలొస్తే, నా గతేంటి డాడీ? ఆ నల్లపిల్లకు నేను పెళ్లి ఎట్లా చేయగలను? ముందుచూపుతో చెప్తున్నా. పెళ్లికూతురు మాత్రమే కాదు ఆమె తల్లి, తండ్రి, అన్నలు అంతా మంచి రంగులో, అందంగా ఉండాలి.'' చెప్పాడు అరుణ్.

అంతా తలలు పట్టుకున్నారు.

★ ★ ★

గంగాధరం మ్యారేజి బ్యూరో వాళ్లకి, సంబంధాలు తెస్తున్న మధ్యవర్తులకి చెప్పేశాడు.

''పిల్ల ఫోటో ఒక్కటే చూపిస్తే చాలదండీ. ఆ పిల్ల తల్లి, తండ్రి, అన్నదమ్ములు, అక్క చెల్లెళ్లు వగైరా ఫ్యామిలీ ఫోటోలన్నీ చూపించాలి.''

''ఇదేం గొడవండీ బాబూ! వందల పెళ్లిళ్లు చేయించాం. ఇటువంటి కండిషన్ పెట్టిన వాళ్లని ఎవర్నీ చూల్లేదు'' అన్నారు మ్యారేజి బ్యూరో వాళ్లు.

''ఇప్పుడు చూస్తున్నారుగా!'' అని రుసరుసలాడాడు గంగాధరం.

''జాతకాలు, నక్షత్రాలు అడిగే వాళ్లని చూశాం గానీ, ఇదేం విడ్డూరమండీ పిల్ల తల్లి, తండ్రి, అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ల ఫోటోలు గూడా చూపించమంటారేవిటండీ? అంతా వింతగా ఉంది.'' అని వాపోయారు మధ్యవర్తులు.

''వింతో, విడ్డూరమో అలాగైతేనే రండి. లేకపోతే పొండి'' అని బిరబిరలాడాడు గంగాధరం.

ఆర్నెల్ల తర్వాత అన్నీ సవ్యంగా ఉన్నాయంటూ నెల్లూరి నుంచి ఒక ఫ్యామిలీ ఫోటోతో సహా వచ్చాడు పేరయ్య.

ఏ వంకా పెట్టడానికి లేదు. అమ్మాయి సుందరి పేరుకి తగినట్లే అతిలోకసుందరి. ఆమె అన్న సంతోష్ నలకూబరుడంత అందగాడు. సుందరి తల్లిదండ్రులు గూడా ఒడ్డూ, పొడుగూ రంగూ ఉన్నవారే.

సుందరి చెన్నైలో బి.టెక్ ప్యాసయింది కూడాను.

అరుణ్‌కి సుందరి నచ్చింది. పెళ్లిచూపులకు బయల్దేరి వెళ్లారు. నెల్లూరులో వాళ్లది కాపువీధిలో లంకంత ఇల్లు. తరతరాల నుంచి స్థితిమంతులు. సుందరి ఫ్యామిలీకి గూడా అరుణ్ నచ్చాడు. హైదరాబాద్‌లో అతను చేసే ఉద్యోగం స్పెషల్ ఎట్రాక్షన్.

పెళ్లిచూపుల తతంగం పూర్తయింది.

''మమ్మీ! నాకీ సంబంధం నచ్చింది'' తల్లి చెవిలో గుసగుసలాడాడు అరుణ్.

అరుణ్ అభిప్రాయం అటు భర్తకు, కూతురికి, అల్లుడికి గూడా పాసాన్ చేసింది నిర్మలమ్మ.

''హమ్మయ్య. వీడికి సంబంధం నచ్చింది'' అని ఊపిరి పీల్చుకున్నాడు గంగాధరం.

''బావగారూ! మా అబ్బాయికి మీ అమ్మాయి నచ్చిందండీ. పురోహితుణ్ని పిలిపిస్తే ముహూర్తాలు పెట్టుకుందాం'' వరస కలుపుతూ హేహీగా చెప్పాడు గంగాధరం.

సుందరి తండ్రి తల ఊపి ఇంట్లోకి వెళ్లాడు.

''అబ్బాయి నిన్ను ఇష్టపడ్డాడు. నువ్వేమంటావు?'' కూతుర్ని అడిగింది తల్లి.

''మమ్మీ! వాడు ఫోటోలో ఉన్నట్లు లేడే'' పెదవి విరిచింది సుందరి.

''తప్పమ్మా! వాడు, వీడు అనకూడదు'' అన్నది తల్లి.

''ఎందుకనగూడదూ! అప్పుడే నాకు మొగుడైపోయాడా ఏంటి?'' రుసరుసలాడింది సుందరి.


''సర్లేవే! ఫోటోలో ఉన్నట్లు లేడంటావేంటి! అబ్బాయి నిక్షేపంగా ఉంటేనూ?'' అడిగింది తల్లి.

''ఫోటోలో బట్టతల కనబడ్డాదా? ప్రశ్నించింది సుందరి.

''బట్టతలేంటే నీ ఇల్లు బంగారం గానూ! ఏదో ముందు కొంచెం జుట్టు లేదు. అంతేగా!'' అన్నది తల్లి.

''నీకేం తెలీదు ఊరుకో. నువ్వు సరిగ్గా చూడ్లా. కొంచెం కాదు. బాగానే ఉంది బట్టతల. కనిపించకుండా ముందుకి దువ్వుకున్నాడు. ముందు ముందు జుత్తు మొత్తం ఊడిపోయి బోడిగుండైపోతుంది. బట్టతల వాళ్లంటే నాకు అసహ్యం'' అన్నది సుందరి.

సుందరి అభిప్రాయం అందరికీ తెలిసిపోయింది.



''ఇదుగో! గంగాధరంగారూ! మా అమ్మాయికి మీ వాడు నచ్చలేదట'' చెప్పాడు సుందరి తండ్రి.

గంగాధరం నెత్తిన టపాకాయలు పేలినట్లు దిమ్మతిరిగిపోయాడు.

'ఓర్నాయనో! అరుణ్ లాంటి హేండ్సమ్ కుర్రాడిని, హైదరాబాద్‌లో పెద్ద జాబ్ చేస్తున్నోడిని, నచ్చలేదని చెప్పే తెగువున్న పిల్ల నెల్లూర్లో ఉందన్న మాట' అనుకున్నాడు.

''నువ్వు ఆ పిల్లకు నచ్చలేదంటావా!'' అన్నాడు గంగాధరం.

''వ్వాట్?'' వెలవెలబోతున్న ముఖంలో నమ్మలేనట్లు చూశాడు అరుణ్.

''నీకు బట్టతల స్టార్టయిందంట. ఆ పిల్లకు బట్టతల వాళ్లంటే ఎలర్జీ అట'' అన్నాడు గంగాధరం.

''మా పెద్దన్నయ్యకు బట్టతలేగా! అది వీడికి వచ్చింది. దానికి వాడేం చేస్తాడూ!'' అని దీర్ఘాలు తీసింది నిర్మలమ్మ.

''వాడేం చేస్తాడంటే బట్టతల మీద వెంట్రుకలు పుట్టించుకుంటాడు'' వ్యంగ్యంగా అన్నాడు గంగాధరం.

★★★

అందగాడు అరుణ్ ఇప్పుడు బట్టతల మీద హెయిర్ ప్లాంటేషన్ చేసే క్లినిక్కుల చుట్టూ తిరుగుతున్నాడు.

☆